క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాతో నిఘా

తాళ్లపూడి: నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమాలను కనిపెట్టేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరా సహకారంతో మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యవేక్షణ చేపట్టినట్టు తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆదివారం తుపాకులగూడెం శివారున, పరిసర ప్రాంతాల్లో కొండల మధ్యలో డ్రోన్‌తో విజువల్స్ తీసారు. ప్రక్కిలంక రెవెన్యూ పరిధిలోని గోదావరి పరిసర ప్రాంతాల్లో లంక భూముల్లోనూ డ్రోన్‌తో పరిశీలించినట్టు తెలిపారు. ఇకపై మండలంలో నేరాల అదుపునకు, సారా బట్టీల నిర్వహణ, తదితర అసాంఘిక కార్యక్రమాలను అదుపు చేసేందుకు డ్రోన్లను వినియోగిస్తామని ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా ఈశ్వర్ రెడ్డి



దేవరపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా దేవరపల్లి మండలం కృష్ణంపాలేనికి చెందిన సత్తి సాయి వెంకట కృష్ణ ఈశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సాయి వెంకట కృష్ణ ఈశ్వర్‌రెడ్డిని నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలోసాయి వెంకట కృష్ణ ఈశ్వర్ రెడ్డి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగాను, మండల కమిటీ ఉపాధ్యక్షుడిగా చేశారు. తనపై ఎంతో నమ్మకంతో పదవిని ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత, జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, నియోజకవర్గంలోని పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శాఖా గ్రంథాలయ అధికారిగా సత్యనారాయణ

దేవరపల్లి: దేవరపల్లి శాఖా గ్రంథాలయ అధికారిగా వెజ్జు సత్యనారాయణ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గోపాలపురం శాఖా గ్రంథాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చినట్టు ఆయన తెలిపారు. నిరుద్యోగులు, స్థానికులు, విద్యార్థులు, ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకపఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. గ్రంథాలయంలో 9 వేల పుస్తకాలు, ఐదు దిన పత్రికలు, వార, మాస పత్రికలు ఉన్నట్టు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు మృతి

నల్లజర్ల: వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన చికిలే వెంకటేశు దేవరపల్లి మండలం యర్నగూడెం తన అక్క ఇంటికి వెళ్లి తిరిగి వెళుతుండగా అనంతపల్లి గ్రామ శివారు హైస్కూల్ వద్ద రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళుతున్న వ్యాన్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో వెంకటేశు (34) అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

శానిటైజర్ తాగి వ్యక్తి మృతి

గోపాలపురం: కల్లు అనుకొని శానిటైజర్ తాగిన వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపురం మండలం భీమోలులో ఆదివారం జరిగింది. ఎస్సై పి మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా వాసేడు మండలం ఎచ్చర్లపల్లి గ్రామానికి చెందిన ఎస్.ముత్తయ్య గోపాలపురం మండలం భీమోలులో చేపల చెరువుల వద్ద పనికి వచ్చాడు. ఆదివారం కల్లు సీసా తెచ్చుకొని చేపలకు పిచికారీ చేసే శానిటైజర్ సీసా వద్ద పెట్టాడు. గంట తర్వాత వచ్చి శానిటైజర్ తాగడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. తోటి కూలీల సహాయంతో గోపాలపురం సీహెచ్‌సీకి తరలించగా ముత్తయ్య (50) అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డిపోల వద్ద రేషన్ సరకుల పంపిణీ ప్రారంభం

దేవరపల్లి: రేషన్ దుకాణాల వద్ద సరకుల పంపిణీని ఆదివారం పునఃప్రారంభించారు. దేవరపల్లి సొసైటీ, బందపురంలోని 20వ నంబర్ దుకాణం వద్ద తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, మండలంలోని 35 రేషన్ దుకాణాల పరిధిలో 25,416 రేషన్ కార్డులున్నాయని తెలిపారు. కార్డుదారులకు ప్రతి నెలా 352 మెట్రిక్ టన్నుల బియ్యం, 11 మెట్రిక్ టన్నుల పంచదార పంపిణీ చేస్తున్నామన్నారు. సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

సత్యవాడలో..

ఉండ్రాజవరం: ప్రజలకు నిత్యావసరాలు నిరాటంకంగా అందించాలనే లక్ష్యంతో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నట్టు ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సత్యవాడలో రేషన్ సరకుల పంపిణీని ఆదివారం ఆయన ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, ఆర్డీవో రాణి సుస్మిత పాల్గొన్నారు.

కరోనా ముప్పు పొంచి ఉన్నా.. సన్నద్ధత ఏదీ?

- అందుబాటులో లేని కోవిడ్ టెస్టింగ్, పీపీఈ కిట్లు, మాస్కులు, శానిటైజర్లు
- పీహెచ్‌సీల్లో పలు రకాల మందుల కొరత
- గతంలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్, ఆక్సిజన్ సిలిండర్లే దిక్కు



నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐసోలేషన్ వార్డులో ఏర్పాటు చేసిన బెడ్‌లు

నిడదవోలు రూరల్: కోవిడ్.. ఈ పేరు చెబితేనే ప్రపంచ దేశాలన్నీ హడలెత్తిపోతాయి. ముఖ్యంగా 2020–21లో ఈ మహమ్మారి ప్రజలను గడగడలాడించింది. నాలుగేళ్ల తర్వాత ప్రస్తుతం కొత్త వేరియంట్‌తో కరోనా వైరస్ దేశంలో నెమ్మదిగా విస్తరిస్తోంది. ఇప్పటికే అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం సూచించినా రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధతకు సంబంధించి సరైన చర్యలు చేపట్టలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన ఐసోలేషన్ వార్డులు, ఆక్సిజన్ సిలిండర్లు ఉన్నప్పటికీ కోవిడ్ టెస్టింగ్ కిట్లు, పీపీ కిట్లు, మాస్కులు, శానిటైజర్లు, చికిత్సకు అవసరమైన మందులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఇక వైద్యులు, స్టాఫ్ నర్సుల కొరత వేధిస్తున్నప్పటికీ ఈ ఏడాదికి కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం. నిడదవోలులో సామాజిక ఆసుపత్రితో పాటు అర్బన్ హెల్త్ సెంటర్, సమిశ్రగూడెం, తాడిమళ్ల, పెరవలి, కానూరు, ఉండ్రాజవరం, వేలివెన్నులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇప్పటి వరకు ఒక్క కరోనా కేసు నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు.

● కొత్త వేరియంట్

ఎన్‌బీ 1.8.1, కేపీ–2, జెన్–1 అనే కొత్త కోవిడ్ వేరియంట్ రాష్ట్రంలో ప్రవేశించింది. దీంతో రాష్ట్రంలో అక్కడక్కడ కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఇది అంత ప్రాణాంతకం కాదని, జాగ్రత్తలు పాటిస్తే తప్ప వ్యాధి బారి నుంచి బయటపడటం కష్టమని వైద్యులు సూచిస్తున్నారు. కోవిడ్–19 సమయంలో నిడదవోలు నియోజకవర్గంలో వేలాది మంది ప్రజలు కోవిడ్ బారిన పడ్డారు. దురదృష్టవశాత్తూ కొంతమంది మృతి చెందారు. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ, వలంటీర్లు, వైద్య బృందాలను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేసి లాక్‌డౌన్ విధించి వ్యాధి సోకకుండా కట్టడి చేసింది. ప్రతి ఒక్కరికీ కోవిడ్ వ్యాక్సిన్ అందించి ప్రజల ప్రాణ రక్షణకు అండగా నిలిచింది. కరోనా నేపథ్యంలో నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో ప్రస్తుతం నాలుగు బెడ్‌లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల్లో మాత్రం ఎక్కడా మాస్కులు, శానిటైజర్లు, కోవిడ్ టెస్టింగ్ కిట్లు, పీపీఈ కిట్లు, కోవిడ్‌కు సంబంధించిన మందులు అందుబాటులో లేవు.



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఆదివారం పీహెచ్‌సీకి వేసిన తాళం



సమిశ్రగూడెంలోని కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఆదివారం పీహెచ్‌సీలో సేవలు బంద్

ఒక వైపు కరోనా వైరస్ వ్యాపిస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నా కొంతమంది వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి ఉంది. కానీ ప్రతి ఆదివారం ఇక్కడ వైద్యసేవలు అందడం లేదు. పీహెచ్‌సీకీ తాళాలు వేయడంతో వైద్యం కోసం వచ్చే రోగులు ఆర్ఎంపీ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వైద్యులు కూడా అందుబాటులో ఉండటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల తాడిమళ్ల పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి దుర్గేష్ అక్కడ ల్యాబ్ మూసి వేయడాన్ని చూసి వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోవిడ్ లక్షణాలు

తీవ్రమైన జ్వరం, గొంతు నొప్పి, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని కోవిడ్ టెస్టులు చేయించుకోవాలి. క్షయ, గుండె సంబంధిత వ్యాధి, ఊపిరితిత్తుల వ్యాధితో పాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి.

అప్రమత్తంగా ఉండాలి



కోవిడ్ కొత్త వేరియంట్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చిన్నపిల్లలు జాగ్రత్తగా పాటించాలి. ఎప్పటికప్పుడూ చేతులు శుభ్రం చేసుకోవాలి. నిడదవోలు సీహెచ్‌సీలో 4 బెడ్‌లతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం. ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ ఫయాజ్, ఆసుపత్రి సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, నిడదవోలు

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఉపాధి నిమిత్తం ఇతర దేశాల నుంచి వచ్చే ప్రజల నుంచి దూరం ఉంచాలి.
- మాస్కులు ధరించాలి. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలి. వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా బయటకి రాకూడదు.
- జన సంచారం కలిగిన ప్రదేశాలకు, వివిధ కార్యక్రమాలకు, ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు మాస్కులు తప్పనిసరిగా ధరించాలి.

అమలుకు నోచుకోని సూపర్ సిక్స్ పథకాలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- కొవ్వూరులో 'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ
- చంద్రబాబు మోసాలను నిరసిస్తూ ఈనెల 4న వెన్నుపోటు దినం



కొవ్వూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



గోపాలపురంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ తానేటి వనిత తదితరులు

చాగల్లు(కొవ్వూరు): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో ప్రజలను చంద్రబాబు మభ్యపెడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అరాచక పాలన సాగిస్తున్నారని, వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. హామీల అమలుపై కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు.

వెన్నుపోటు రాజకీయాలకు ఆద్యుడు చంద్రబాబు

నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ వెన్నుపోటు రాజకీయాలకు ఆద్యుడిగా చంద్రబాబు పేరుగాంచారన్నారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని అన్నారు. రాష్ట్ర ప్రజలు త్వరలోనే చంద్రబాబుకు గుణపాఠం చెబుతారన్నారు. ఈనెల 4న కొవ్వూరు మెరక వీధి నుంచి ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని తలారి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కోడూరి శివరామకృష్ణ, పట్టణ, చాగల్లు మండల అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, నాయకులు గండ్రోతు సురేంద్రకుమార్, కాకర్ల వెంటేశ్వరరావు, కొలిశెట్టి నాగేశ్వరరావు, పిట్టా శ్రీను, సుంకర సత్యనారాయణ, పరిమి సోమరాజు, కంఠమని రమేష్, ఇంటి వీర్రాజు, ఉప్పులూరి సూరిబాబు, కవల నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

గోపాలపురం: చంద్రబాబు నయవంచనకు నిరసనగా వైఎస్సార్ సీపీ చేపట్టే వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి, రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత మాట్లాడుతూ ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తూ అరెస్టుల పర్వానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నామంటూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారన్నారు. ఈనెల 4న నల్లజర్లలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, నాయకులు గన్నమని జనార్దన్, ఇళ్ల భాస్కరరావు, వెలగా శ్రీరామమూర్తి, సాలి వేణు, ముచ్చికర్ల రవి, పీతల ప్రసాద్,అచంట సురేష్, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పోతుల అప్పిరెడ్డి గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పోస్టర్ ఆవిష్కరణ

దేవరపల్లి: ఏడాది పరిపాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన తీరును ఎండగడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 4న నిర్వహిస్తున్న చంద్రబాబు వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం యర్నగూడెంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆవిష్కరిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, రాష్ట్ర హోమ్ శాఖ మాజీ మంత్రి, రాష్ట్ర పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

పశ్చిమ డెల్టా కాలువలకు నీటి విడుదల

- హెడ్ స్లూయిజ్ వద్ద గోదావరి నదికి పూజలు




విజ్జేశ్వరం వద్ద గోదావరి నదికి పూజలు చేస్తున్న ఇరిగేషన్ ధవళేశ్వరం ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటస్వామి

నిడదవోలు : గోదావరి జలాల విడుదలతో పశ్చిమ డెల్టా కాలువలు పరవళ్లు తొక్కుతున్నాయి. తొలకరి పలకరింపు, గోదావరి జలాల రాకతో ఏరువాక ప్రారంభించడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు వేద పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఆదివారం ఉదయం 9.10 గంటలకు జలవనరుల శాఖ ధవళేశ్వరం ఇన్‌ఛార్జి ఎస్ఈ బి.వెంకటస్వామి స్విచ్ ఆన్ చేసి హెడ్ స్లూయిజ్ గేట్లను ఎత్తారు. హెడ్ స్లూయిజ్ మొదటి గేటు నుంచి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దశలవారీగా మిగిలిన గేట్లను ఎత్తి 500 క్యూసెక్కులకు పెంచి నీటిని విడుదల చేశారు. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయనున్నారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాలువతో పాటు ఉప కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా హెడ్ స్లూయిజ్‌ను మామిడి తోరణాలు, అరటిచెట్ల గెలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా జలవనరుల శాఖ ధవళేశ్వరం ఇన్‌ఛార్జి ఎస్ఈ బి. వెంకటస్వామి, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె. మురళీకృష్ణంరాజు హెడ్ స్లూయిజ్ వద్ద గోదావరి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమ డెల్టాలో తాగు, సాగునీటిని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య గోదావరి మాతకు నూతన వస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పించారు. ఈ కార్యక్రమంలో సెట్టిపేట ఈఈ పి. సుబ్రమ్మణ్యేశ్వరరావు, తాడేపల్లిగూడెం డీఈ కె. ధర్మజ్యోతి, నిడదవోలు ఏఈ ఎంవీవీ పెద్దిరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫామ్ పాండ్స్ నిర్మాణం

నల్లజర్ల: పొలాల్లో నీటిని నిల్వ చేసుకుని, పంటలు ఎండిపోకుండా కాపాడుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల భూముల్లో పంట సంజీవని పేరిట ఫామ్ పాండ్స్ (నీటి గుంతలు) నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ పనులు మండలంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలో మొత్తం 150 పాండ్స్ ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 16 పూర్తి చేశారు. మరో 60 వివిధ దశల్లో ఉన్నాయని టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు తమ పొలాల్లో రూ.35 వేల నుంచి రూ.60 వేల వరకూ విలువైన పనులు చేయించుకోవచ్చు. పొలంలో 2 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తే ఉపాధి హామీ సిబ్బంది రెండు రకాల ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేస్తారు. వర్షపు నీరు వృథా పోకుండా ఈ పాండ్స్‌లోకి మళ్లించి నిల్వ చేస్తారు. వ్యవసాయ బోర్లు ఉన్నప్పటికీ విద్యుత్ కోతల వలన అవసరమైనంత నీరు పంటలకు అందించలేని పరిస్థితిలో ఈ ఫామ్ పాండ్స్ ఎంతో ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

కొవ్వూరు మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు సత్కారం




కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం మేనేజర్‌ను సత్కరిస్తున్న అధికారులు

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో 43 ఏళ్లుగా మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన పి.సాయిబాబు అభినందన సత్కార కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొవ్వూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయిబాబు దంపతులను అధికారులు, సిబ్బంది పూలమాలు, శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రసంసాపత్రం, జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నల్లజర్ల: పోతవరంలో గంగానమ్మ జాతర సందర్భంగా హైదరాబాద్ ఐకాన్ ఆసుపత్రి వైద్యుడు డీవీ కృష్ణారావుతో పాటు డాక్టర్ల బృందం, సిబ్బంది స్థానిక శ్రీశ్రీ ఫంక్షన్ హాలులో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్, గన్నమని వెంకటేశ్వరరావు ప్రారంభించారు. దాదాపు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత




ఉండ్రాజవరంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలతో నిర్మల మాతాజీ నిర్వాహకులు

ఉండ్రాజవరం: ధ్యానం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, ధ్యానం ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని నిర్మల మాతాజీ నిర్వాహకులు బంధకవి సాయి శేఖర్ అన్నారు. ఉండ్రాజవరంలోని నిమ్మతోటలో ఉన్న నిర్మల మాతాజీ ధ్యాన మందిరంలో ఆదివారం వేసవి శిక్షణ తరగతుల శిబిరం ముగింపు సమావేశం సాయి శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మే నెల 11 నుంచి 31వ తేదీ వరకు 20 రోజుల పాటు కొనసాగిన ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులకు శతక పద్యాలు, డ్రాయింగ్, క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లిషు తదితర అంశాల్లో శిక్షణ నిచ్చారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రిటైర్డ్ ప్రిన్సిపాల్ మల్లిన రాజేంద్రప్రసాద్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా జ్ఞాపికలు, పెన్నులు బహూకరించారు. శిక్షణ గురువులు తెలుగు పండితులు చెరుకూరి వెంకట కృష్ణప్రసాద్, శేషమణి దంపతులను కొల్లేపల్లి రాజేంద్ర గుప్త, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, రిటైర్డ్ ఆంగ్ల బాష అధ్యాపకులు సినీ ఆర్టిస్ట్ కోట రామప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భారత వైమానిక దళ మాజీ అధికారి కడించర్ల రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తితో సేవ చేయాలని పిలుపునిచ్చారు.

జనానికి బియ్యం మోత

● వృద్ధులకు తప్పని తిప్పలు



డి.ముప్పవరంలో డీలర్ వద్ద వరుసలో ఉంచిన రేషన్‌కార్డులు

నిడదవోలు రూరల్: కూటమి ప్రభుత్వం ఇంటింటికీ బియ్యం పంపిణీ వ్యవస్థకు మంగళం పాడి, తిరిగి రేషన్ దుకాణాల్లోనే సరకుల పంపిణీని ప్రారంభించడంతో దుకాణాల ముందు క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి కార్డుదారులకు మళ్లీ దాపురించింది. నిడదవోలు పట్టణం, మండలంలో 51 రేషన్ షాపులుండగా 34,483 రేషన్‌కార్డులున్నాయి. మండలంలోని డి.ముప్పవరంలో రేషన్ పంపిణీ ప్రక్రియను 'సాక్షి' పరిశీలించగా లబ్ధిదారులు సరకుల కోసం డీలర్ వద్ద ఆధార్, రేషన్ కార్డులను లైన్లో పెట్టారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే బియ్యం పంపిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్ర స్థాయిలో ఎటువంటి ఆదేశాలూ రాలేదని తెలుస్తోంది. దీంతో, వృద్ధులు అష్టకష్టాలు పడుతూ రేషన్ షాపులకు వచ్చి బియ్యం తీసుకువెళ్లారు.

రేగులమ్మ జాతరలో కలశాల ఊరేగింపు



రేగులమ్మ జాతర సందర్భంగా పెద్దాపురంలో కలశాల ఊరేగింపు

గోపాలపురం: రేగులమ్మ జాతర సందర్భంగా ఆదివారం పెద్దాపురం గ్రామంలోని మహిళలు ఆదివారం కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. పుట్టినిల్లు నుంచి అమ్మవారిని మెట్టినింటికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామ నడిబొడ్డున అమ్మవారికి మహిళలు తీసుకువచ్చిన కలశాల నీటితో జలాభిషేకం చేశారు. ఈనెల 8న గ్రామంలో ఆడపడులకు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలను బహూకరించి, బంధువులు, కుటుంబ సభ్యుల సమక్షంలో జాతర నిర్వహిస్తారు. అమ్మవారిని పుట్టినిల్లు పిన్నమనేని ఇంటి నుంచి మెట్టనిల్లు వేములపల్లి వారి ఇంటికి పంపించడంతో జాతర ముగుస్తుందని నిర్వాహకులు కొర్లపాటి అన్నవరం, గన్నిన రామారాయుడు, పిన్నమనేని దత్తాత్రేయుడు, గన్నిన మురళీ ఆదినారాయణ తెలిపారు.

అమ్మవారికి ఘన స్వాగతం

నల్లజర్ల: పోతవరం గ్రామ దేవత జాతరలో భాగంగా అమ్మవారికి ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. గరగలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఈ ఉత్సవం కోలాహలంగా జరిగింది. మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

శాస్త్రీయ పద్ధతులతో మేలైన దిగుబడులు

నల్లజర్ల: ఆయిల్‌పామ్ సాగులో శాస్త్రీయ పద్ధతులు, సరైన నిర్వహణ పాటించడం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చునని పెదవేగిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు అన్నారు. అచ్చన్నపాలెం, కవులూరు, పోతవరం గ్రామాల్లో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కవులూరులో డాక్టర్ రామచంద్రుడు మాట్లాడుతూ, మట్టి, నీటి నిర్వహణ, ఎరువులు, పోషక నిర్వహణ, కీటకాలు – రోగ నివారణ పాటించాలని రైతులకు సూచించారు. విజయరాయి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వెంకట రమణ వరి రకాలు, తెగుళ్ల నివారణపై వివరించారు. అచ్చన్నపాలెంలో డాక్టర్ రేణుక మాట్లాడుతూ, కోకో విస్తరణ, కొమ్మ కత్తిరింపులు తదితర అంశాలను వివరించారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటల గురించి డాక్టర్ ప్రసాదరెడ్డి వివరించారు. పోతవరంలో కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన డాక్టర్ విజయలక్ష్మి తెల్ల దోమ నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానశాఖాధికారి ఎం.బబిత, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి : పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని తమ చిన్ననాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–1999లో ఆరు నుంచి పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తరువాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడినా కలిసి చదువుకున్న స్నేహితులు 25 ఏళ్ల తర్వాత ఒక చోట చేరి బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. తమ గురువులు గిరి మాస్టర్, శ్యామల తదితరులను ఘనంగా సత్కరించారు.